ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 30 జూన్ 2025

కేఎంసీ తాండాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు



మదనపల్లెలో నాలుగు నాటుసారా రహిత గ్రామాలు

● ఫలితాలిస్తున్న ఎక్సైజ్ అధికారుల చర్యలు

మదనపల్లె టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గంలోని నాలుగు గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. ఆదివారం ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో మదనపల్లె మండలంలోని మూడు గ్రామాలు, రామసముద్రం మండలంలోని ఒక గ్రామంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ భీమలింగ మాట్లాడుతూ మదనపల్లె మండలంలోని కొండమీదచెరువు తాండా, తుమ్మలతాండా, దాదినాయనితాండా, రామసముద్రం మండలంలోని చెంబకూరు హరిజనవాడలో గతంలో నాటుసారా తయారీ, విక్రయాలు జరిగేవన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం-2 పథకంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఆ గ్రామాల్లో ప్రజలు నాటుసారా జోలికి వెళ్లకుండా ఇతర జీవనాధారాలు కల్పించామన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో, సమన్వయంతో ఈ నాలుగు గ్రామాల్లో నాటుసారాను నిర్మూలించామన్నారు. ఇప్పుడు ఈ నాలుగు గ్రామాలు నాటుసారా రహిత గ్రామాలుగా ప్రకటిస్తున్నామన్నారు. ఇక మీదట ఈ గ్రామాల్లో నాటుసారా సంబంధిత ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405కు ఫోన్ చేయాలని సీఐ కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు జబీవుల్లా, డోర్కాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పొర్లు దండాలు పెడుతూ..

● మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరసన



పొర్లు దండాలు పెట్టి నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట 8వ రోజు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు శంకరయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అదేవిధంగా స్థానికంగా ఉన్న సమస్యలపై అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ సెక్షన్ మండల అధ్యక్షుడు అక్బర్, రమణ, ఈశ్వరయ్య, కార్మికులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట

● రసాభాసగా టీడీపీ పట్టణ కార్యవర్గ ఎంపిక సమావేశం

● అర్ధంతరంగా ఆపేసి వెళ్లిపోయిన అబ్జర్వర్లు

బి.కొత్తకోట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ టీడీపీ అధ్యక్షుడితో పాటు, వార్డు ఇన్‌చార్జ్‌ల ఎంపిక గందరగోళంగా మారింది. ఇరువర్గాలకు చెందిన వారు బాహాబాహికి దిగడంతో ఎన్నికల పరిశీలకులు సమావేశాన్ని అర్ధంతరంగా ఆపేసి వెళ్లిపోయారు. మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకులు శీతయ్య, మండల పార్టీ కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం బి.కొత్తకోటలో సమావేశం నిర్వహించారు. టీడీపీ శ్రేణులు రెండు వర్గాలుగా విడిపోయి పరస్పరం దాడులకు తెగబడ్డారు. వారం రోజులుగా బి.కొత్తకోట మండలంలోని పలు గ్రామాలలో పరిశీలకులతో పాటు స్థానిక నాయకులు టీడీపీ కార్యకర్తలను సమావేశపరిచి గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. అదేవిధంగా ఆదివారం పట్టణ అధ్యక్షుడితో పాటు ఇతర కార్యవర్గం ఎంపిక జరుగుతుందని మండల కన్వీనర్ ప్రకటించారు. వార్డుల వారీగా ఆశావహుల పేర్లను పరిశీలకులు నమోదు చేసుకుంటుండగా మరో వర్గం గొడవకు దిగింది. వీళ్ల చెప్పిన పేర్లే రాసుకుంటూ పోతే ఎలా అంటూ గొడవకు దిగారు. మాకు వర్గాలతో పనేముంది ఎన్ని పేర్లిచ్చినా రాసుకుంటామని చెప్పినా వినలేదు. గొడవకు దిగారు. సమావేశం నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ఇరువర్గాల వారు గొడవపడ్డారు. దీంతో పరిశీలకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని అధిష్ఠానానికి తెలియజేస్తామని పార్టీ ఆదేశాల మేరకు కార్యవర్గ ఎంపిక జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇరువర్గాలకు చెందిన కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, కుడుం శ్రీనివాసులు, కనకంటి ప్రసాద్, చాకనా రాజా, గంజిమోహన్, లోకనాథరెడ్డి, శివరాం, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం ఎదుట గొడవపడుతున్న ఇరువర్గాల టీడీపీ నాయకులు



మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్

నివాసాలు లేకున్నా..

● జగనన్న లేఅవుట్‌లలో మాయాజాలం

● ప్లాట్లు లేని చోట్ల ఇబ్బడిముబ్బడిగా విద్యుత్ లైన్లు

● నిరుపయోగంగా.. పవర్ సప్లయ్..!


● అవసరం లేని చోటా త్రీఫేజ్ లైన్లు

● బీకే పల్లె లేఅవుట్‌లో కండెక్టర్ మాయం



కురబలకోట మండలం కంటేవారిపల్లె జగనన్న లేవుట్‌లో ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు

గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ప్రభుత్వానికి భారీగా నష్టం చేకూర్చింది. జగనన్న లేఅవుట్ల పేరుతో ఇబ్బడి ముబ్బడిగా విద్యుత్ లైన్లు లాగేశారు. లేఅవుట్‌లు పూర్తి కాకుండానే ఈ ప్రక్రియ పూర్తి చేశారు. అక్కడ లబ్ధిదారులకు కేటాయించారా? పట్టాలు జారీ చేశారా? ఇళ్ల నిర్మాణం చేపడతారా? లేదా అనే ఆలోచన లేకుండా విద్యుత్ స్తంభాలు నాటడం, వైర్లు లాగడం, ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టడం ఇలా..రోజుల వ్యవధిలోనే విద్యుత్ పనులు చేపట్టారు.



బీకే పల్లె లేఅవుట్‌లో కండెక్టర్ చోరీకి గురై ఖాళీగా దర్శనమిస్తున్న విద్యుత్ స్తంభాలు

మదనపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట, బి.కొత్తకోట నగర పంచాయతీలతో పాటు 30 మండలాల్లో 550 జగనన్న లేవుట్లు ఉన్నాయి. ఇందులో మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో అన్ని మండలాల్లో కలిపి 105 లేఅవుట్లు ఉన్నాయి. జిల్లాలో తీసుకుంటే రాయచోటి సమీపంలోని నారాయణరెడ్డిగారిపల్లె లేఅవుట్ 6 వేల ప్లాట్లతో జిల్లాలో ప్రథమ స్థానంలో ఉండగా, తర్వాత మదనపల్లె సమీపంలోని పోతబోలు లేఅవుట్ 5 వేల ప్లాట్లతో రెండో స్థానంలో, 1240 ప్లాట్లతో ఆరోగ్యవరం లేఅవుట్ మూడో స్థానంలో ఉంది. ఇందులో ఆరోగ్యవరం సమీపంలోని 42 ఎకరాల్లో రెండు పెద్ద లేఅవుట్‌లలో పట్టణంలోని లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారు. కొందరికి పట్టాలు కూడా జారీ చేశారు. అయితే తర్వాత భూమి యజమానులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఇళ్ల నిర్మాణాలకు బ్రేక్ పడింది. దీంతో ఆరోగ్యవరంలోని రెండు లేఅవుట్లలో ఎక్కడా పునాది కూడా పడలేదు. అయితే అప్పటికే 11 కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్లు లాగేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడి భూమి ఎత్తుపల్లాలుగా, వంకలు, బండలు, రాళ్లు ఉండటంతో విద్యుత్ స్తంభాలు ఇష్టారాజ్యంగా, అంతకు మించి అనవసరంగా స్టే వైర్లు, స్టట్ పోల్స్ (సపోర్టు) ఏర్పాటు చేశారు. ఇలా ఒక్కో స్తంభానికి రెండు నుంచి మూడు స్తంభాలు కూడా అడ్డుపెట్టిన సందర్భాలు ఉన్నాయి. అలాగే కండెక్టర్ సైజు నిర్దీత పరిమాణం కంటే తక్కువ సైజు వాడినట్లు చెబుతున్నారు. పోల్స్ ఫిట్ ఏర్పాటు చేయడంలో మెత్తని స్థలంలో కూడా బ్లాస్టిక్ పేరుతో బిల్లు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. టర్న్‌కీ (మెటీరియల్ అంతా కాంట్రాక్టర్ తెచ్చుకునే) విధానంలో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. దీంతో వైసీపీ ప్రభుత్వంలోని కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆరోగ్యవరం లేఅవుట్‌లు వినియోగంలోకి రాకపోగా, అక్కడ కనీసం నిర్మాణాలు కూడా చేపట్టలేదు. దీంతో వందల విద్యుత్ స్తంభాలు, వేల మీటర్ల విద్యుత్ వైరు నిరుపయోగంగా మారింది. అది కూడా లేఅవుట్లలో అన్ని చోట్లా సింగిల్‌ఫేజ్ కాకుండా అవసరం లేకున్నా.త్రీఫేజ్ లైన్లు లాగేశారు. ఇలా కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి నష్టం చేకూరింది.

మదనపల్లె శివారులోని బీకే పల్లె లేఅవుట్‌లో పట్టణంలోని పేదలకు పదేళ్ల క్రితం స్థలాలు కేటాయించారు. అక్కడ కూడా ఇలాగే విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి వైర్లు లాగారు. అక్కడ కొన్ని పునాది దశలో ఆగిపోగా మరికొన్ని ఇళ్ల పనులే ప్రారంభించలేదు. అయితే అక్కడా విద్యుత్ లైన్లు చోరీ కావడంతో విద్యుత్ స్తంభాలు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. ఆ విద్యుత్ లైన్లను రాత్రివేళ దొంగలు కొంత చోరీ చేయగా, మరికొంత ఇంటి దొంగలు తీసేసినట్లు చెబుతున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం కంటేవారిపల్లె సమీపంలోని 400 గృహాలతో మూడు జగనన్న లేఅవుట్లు వేశారు. అక్కడ కూడా విద్యుత్ లైన్లు ఇబ్బడిముబ్బడిగా లాగేశారు. ఈ క్రమంలో ఒకచోట నుంచి మరో చోటికి లైన్ వెళ్లే ప్రాంతంలో 11 కేవీ లైన్, ఎల్‌టీ లైన్లు వేశారు. ఎన్ని స్తంభాలు నాటితే అంత బిల్లు కావడంతో ఇష్టానుసారంగా వేసేశారు. ఈ క్రమంలో పనిలో పనిగా పక్కనే ఉన్న ప్రైవేటు భూమి, లేఅవుట్‌లకు ప్రయోజనం కలిగేలా లైన్లు వేసినట్లు తెలుస్తోంది. ప్రైవేటు స్థలంలో ప్లాట్లు వేసి రోడ్లు వదిలితే..వాటికి అటు, ఇటు లైన్లు ఏర్పాటు చేశారు. ఇక కొత్త లైన్లు లాగడం పక్కన పెడితే, ఈ ముసుగులో ప్రైవేటు భూములు, లేఅవుట్‌లో భారీగా లైన్లను మార్పు చేశారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాన్ని, లైన్ మార్పు చేయాలంటే ట్రాన్స్‌కోకు షిఫ్టింగ్ చార్జీలు చెల్లించాలి. ఇవి బయటి మార్కెట్‌తో పోలిస్తే విద్యుత్ శాఖలో పదింతలు ఎక్కువగా ఉంటుంది. ఆ లెక్కన కస్టమర్ నుంచి వసూలు చేస్తారు. అయితే జగనన్న లేఅవుట్ల ముసుగులో పైసా కూడా ప్రభుత్వానికి చెల్లించకుండా అనధికారికంగా లైన్లు మార్పు చేశారు. ఆ సొమ్మంతా విద్యుత్ శాఖాధికారుల జేబుల్లోకి వెళ్లింది. ఇది ఒక జగనన్న లేఅవుట్లలోనే కాదు..హైవే రోడ్లు, ఇతర నిర్మాణాల వెంట భారీగా చేశారు. జగన్ ప్రభుత్వం ఇంటికెళ్లగానే, ప్రస్తుతం ఆ పథకానికి తెరపడింది. అప్పట్లో మండలాలు, గ్రామాల్లో చిన్నచిన్న లేవుట్లు, సొంత స్థలాల్లో జగనన్న పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల ఇళ్లకు ఇప్పటికీ లైన్లు లేవు..విద్యుత్ మీటర్లు లేవు. వారంతా ఇప్పటికీ ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఈ స్కీం అయిపోయిందని చెప్పి పంపుతున్నారు.





ఆరోగ్యవరం జగనన్న లేఅవుట్‌లో నిరుపయోగంగా ఉన్న విద్యుత్తు లైన్లు

ముగ్గురు అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్

● రూ.25 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం



పోలీసుల అదుపులో ఉన్న దొంగలు, రికవరీ చేసిన బంగారు నగలు

నందలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద ముగ్గురు దొంగలను పట్టుకుని వారి నుంచి 250 గ్రాముల బంగారం (వీటి విలువ సుమారు 25 లక్షలు)తో పాటు రూ.14 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీసీఎస్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డిలకు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం దుర్గాపురం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులను చూసి పారిపోతున్న ఆవుల సంజయ్య, ఆవుల ఈశ్వరమ్మ, ఆవుల ప్రమీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారని, వారి వద్ద నుంచి 250 గ్రాముల బంగారం, 14 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులు శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట గ్రామానికి చెందిన వారని, వీరిపైన నందలూరులో 2 కేసులు, వేంపల్లె, పులివెందుల, అనంతపురం మూడో టౌన్, ఆళ్లగడ్డ టౌన్, నంద్యాల వన్‌టౌన్‌లలో కేసులు నమోదయ్యాయని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతర్ జిల్లాల దొంగలను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

తగ్గేదేలే..!

● ఆగని వైసీపీ అక్రమాలు

● గతంలో 'గండికోట' లోనూ జోక్యం

● ఉద్దిమడుగు పరిహారంలోనూ కొట్టేసేందుకు యత్నం

● జగన్ అండ్ కో అనుచరులకు రూ.45 కోట్లు చెల్లించేందుకు స్కెచ్

● కీ రోల్ పోషించిన నెల్లూరు దళారీ

ఐదేళ్ల జగన్ పాలన అధోక విస్ఫోటనం అని చెప్పవచ్చు. రూల్స్ గీల్స్ జాన్‌తా నై. వైసీపీ నేతలకు కావాల్సింది, కేడరుకు చేయాల్సింది పట్టుబట్టి చేయించుకున్నారు. అప్పట్లో అధికారులు కూడా జీ హుజూర్ అంటూ వన్‌సైడ్‌గా వ్యవహరించారు. ఎలాగంటే.. గండికోట ముంపువాసుల పరిహారంలోనూ పులివెందుల బ్యాచ్‌కు అవకాశమిచ్చారంటే పరిస్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఎన్నెన్నో విచిత్రాలు జగన్ అండ్ కో హయాంలో జరిగాయి. గత సర్కారు చేసిన డ్యామేజీపై చంద్రబాబు సర్కార్ దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో సిద్దవటం మండలంలోని ఉద్దిమడుగు ప్రాజెక్టు పరిహారంలో వైసీపీ అండ్ కో గ్యాంగ్ బినామీ పేర్లతో సుమారు రూ.45 కోట్లు కొట్టేసేందుకు పక్కా ప్రణాళికతో స్కెచ్ వేశారు. ఈ వ్యవహారంలో నెల్లూరు జిల్లాకు చెందిన ఓ దళారీ కీ రోల్ పోషించాడు.

(కడప-ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం పెద్దపల్లె పంచాయతీ జోగులపల్లెలో ఉద్దిమడుగు ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 1988 డిసెంబరు 14న శంకుస్థాపన కూడా చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా బీడు భూములకు సాగునీరందించి సస్యశ్యామలం చేయాలన్నదే ప్రధాన ఉద్దేశ్యం. అయితే ఇందుకు సంబంధించి భూమి నిర్వాసితులకు గత ప్రభుత్వాలు పరిహారం చెల్లిస్తూ వచ్చాయి. ఈ భూముల వ్యవహారంలో వైసీపీకి చెందిన కీలక నేతలు, జిల్లా పరిషత్‌కు చెందిన ఓ వైస్ చైర్మన్ తన కుటుంబీకుల పేరుతో బినామీ పేర్లతో పరిహారం పొందారనే ఆరోపణలున్నాయి. ఉద్దిమడుగు ప్రాజెక్టు భూసేకరణను ప్రభుత్వం ఐదు రీచ్‌లుగా విభజించింది. అయితే ఇక్కడ ఉద్దిమడుగు నిర్వాసితుల పేరిట పరిహారాన్ని కాజేయాలని వైసీపీ నేతలు కన్నేశారు. ఇందులో భాగంగానే జడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేసిన వారితో పాటు మరికొంతమంది వైసీపీ నేతలు కన్నేసి అటవీశాఖ భూములను రెవెన్యూ అధికారులతో దర్జాగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకొని పరిహారం కొట్టేశారంటారు. కాగా 2021లో పరిహారం పేరిట రూ.35 కోట్లకు పైగా కాజేయగా, ఇప్పుడు మరలా పరిహారం పేరిట రూ.45 కోట్లకు స్కెచ్ వేయడం దుమారం రేపుతోంది. ఇక్కడి జాబితాలో అంతా వైసీపీ అనుచరులుండడం గమనార్హం. భూములు పోయిన బాధితులకు ఇంత వరకు పరిహారం దక్కకపోగా.. బినామీలకు మాత్రం భూములు వచ్చినట్లు తెలుస్తోంది. నెల్లూరుకు చెందిన ఓ దళారీ ద్వారా 2024 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవాలని భారీ ప్రచారం చేసిన ఓ మాజీ వైస్ చైర్మన్ బినామీలే ఆ జాబితాలో ఉండడం విశేషం. ఈ విషయమై అసలు బాధితులు మూడు రోజుల కిందట స్పెషల్ కలెక్టరుకు ఫిర్యాదు చేయడంతో అధికారులు దీనిపై ఆరా తీస్తున్నారు.

ముంపుపరిహారం కొట్టేయడంలో అక్రమాలకు దిక్సూచిగా సోమశిల ప్రాజెక్టును చెప్పవచ్చు. రామోజీ ఫిలింసిటీలో సినిమా సెట్టింగును తలపించే విధంగా ఇక్కడ పరిహారం కోసం జిల్లాలో ఎక్కడైనా పాడుబడ్డ పాత ఇళ్లల్లో ఉన్న టేకు ఇతర విలువైన కలపను కొనుగోలు చేసి గుడారాలు వేసి తద్వారా లబ్ధి పొందారు. అప్పట్లో అది సంచలనంగా మారింది. ఇప్పుడు ఇదే స్క్రిప్ట్‌ను ఉద్దిమడుగు ప్రాజెక్టు పరిహారంలోనూ అమలు చేస్తుండడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది.

పిచ్చిమొక్కల మధ్య ఉన్న శిలాఫలకం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మకొండ ఆలయం లో ఆదివారం అమ్మవారికి అర్చకులు విశేష పూజలు చేశారు. అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సంతానం లేని దంపతులు అమ్మవారికి వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు వివిధ ప్రాంతాల నుంచి రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాందీ షాప్‌లో రూ.5 లక్షల చోరీ

కలికిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలకడ రోడ్డులో నిర్వహిస్తున్న ఒక బ్రాందీషాపులో రూ.5 లక్షలు చోరీ అయ్యాయి. శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఈ చోరీ చేశారని సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. వైన్ షాపు వెనుక వైపు గోడకు కన్నం వేసి చోరీకి పాల్పడ్డారని చెప్పారు. లోపలున్న సీసీ కెమెరాలో చోరీ చేసిన ప్రక్రియ అంతా రికార్డయ్యిందని, అయితే దుండగుడు ముఖానికి గుడ్డ కప్పుకుని చోరీకి పాల్పడ్డట్లు తెలిపారు. కాగా శుక్రవారం జరిగిన అమ్మకాలకు సంబంధించిన నగదును శనివారం బ్యాంకులకు సెలవు కావడంతో జమ చేయలేకపోయారు. ఇక శనివారం అమ్మకాలకు చెందిన డబ్బు కూడా దీనిని జత అయింది. ఈ మేరకు వైన్ షాపు యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ప్లాంట్ వర్కర్ల ఆకలి కేకలు

● 10 నెలలుగా అందని వేతనాలు ● కలెక్టర్ ఒప్పుకోలేదని అధికారుల మెలిక ● కలెక్టర్‌కు పీలేరు ఎమ్మెల్యే లేఖ



పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

పీలేరు రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు సుమారు ఎనిమిదేళ్ల క్రితం పీలేరులో 26 వాటర్ ప్యూరిఫైయింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఉచితంగా ప్రతి ఇంటికీ రోజుకు రెండు క్యాన్ల చొప్పున తాగునీరు అందిస్తున్నారు. వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమైనా ఈ ప్లాంట్లు మాత్రం విజయవంతంగా ప్రజలకు తాగునీరు అందించాయి. ఈ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలు నిర్వహించేందుకు 26 మంది వర్కర్లను నియమించారు. వీరిలో 11 మందికి పీలేరు గ్రామ పంచాయతీ నిధుల నుంచి, మిగిలిన 15 మందికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.7,200 చొప్పున వేతనాలు చెల్లించేవారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికార పార్టీ నేతలు వైసీపీ హయాంలో నియమించిన వర్కర్లను తొలగించి, కొత్తవారిని నియమిం చారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేలు చొప్పున మొదటి మూడు నెలలు వేతనాలు చెల్లించారు. ఈ నేపథ్యంలో పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో వైసీపీ హయాంలో భారీగా నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపణలు వచ్చాయి. దీంతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ ఈ ఆరోపణలపై విచారణ నిర్వహించి సుమారు రూ. 1.50 కోట్లు పక్కదారి పట్టినట్లు తేల్చింది. దీంతో పీలేరు సర్పంచ్ ఎస్.హబీబ్ బాషా, ఇన్‌చార్జి సర్పంచ్ జీనత్ సఫీ చెక్‌పవర్ రద్దు చేశారు. గతంలో ఇక్కడ ఈవోలుగా పనిచేసిన ముగ్గురు సస్పెన్షన్‌కు గురయ్యారు. కలెక్టర్, డీపీవో అనుమతి లేకుండానే వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు పంచాయతీ నిధుల నుంచి జీతాలు చెల్లించడం నిధుల దుర్వినియోగంగా ఈ కమిటీ భావించి, వాటర్ ప్లాంట్లలో పనిచేసే వర్కర్లకు వేతనాల చెల్లింపు ఆపేశారు. దీంతో వారికి వేతనాలు చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలని పంచాయతీ పాలక వర్గం కలెక్టర్‌కు విన్నవించుకుంది.



యర్రరెడ్డి గుట్ట వాటర్ ప్లాంట్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న ప్రజలు

అయితే పంచాయతీ నిధుల నుంచి వేతనాలు ఇవ్వడం కుదరదని, వాటర్ ప్లాంట్ల నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఆపరేటర్ జీతాలు, ఇతర అవసరాల కోసం వాటర్‌క్యాన్లకు ప్రజల నుంచి కనీస రుసుము వసూలు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

సమస్య పరిష్కారానికి నేతల యత్నం

జీతాలు ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్న వర్కర్లు ప్లాంట్ల నిర్వహణపై అనాసక్తి చూపుతున్నారు. ఇంకెంత కాలం ఇలా వెట్టిచాకిరీ చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 26 మినరల్ ప్లాంట్లలో నీరు ఉచితంగా ఇవ్వగా, ఇప్పుడు ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని అధికార పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఎలాగైనా పెండింగ్ జీతాలు ఇప్పించి సమస్య పరిష్కరించాలని యత్నిస్తున్నారు.

పెండింగ్ జీతాలపై ఆరా....

స్థానిక పంచాయతీ కార్యాలయంలో మూడు రోజుల క్రితం పీలేరు అభివృద్ధి కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీతాల పెండింగ్ విషయం కమిటీ చర్చించింది. ఏదో విధంగా జీతాలు చెల్లించాలని, అనంతరం వాటర్ ప్లాంట్ల నిర్వహణకు ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించాలని నిర్ణయం తీసుకుంది. ఇక ఎంతో కాలం వర్కర్లను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని కమిటీ నిర్ణయించినట్లు సమాచారం.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే లేఖ...



వాటర్ ప్లాంట్ల వద్ద పనిచేస్తున్న 26 మంది వర్కర్లకు పది నెలల జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆ లేఖను కలెక్టర్‌కు పంపించాం. ఆయన తీసుకొనే నిర్ణయంపై జీతాల చెల్లింపు ఆధారపడి ఉంటుంది

- లతీఫ్‌ఖాన్, ఇన్‌చార్జి ఈవో, పీలేరు

మోటారు సైకిల్ ఢీకొని హోంగార్డుకు గాయాలు



చికిత్స పొందుతున్న ప్రతాప్ రెడ్డి

కలికిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడు బైక్ నడుపుతూ హోంగార్డును ఢీకొన్నాడు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషను ముందు పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మహ్మద్ ఫజారుద్దీన్ అనే బాలుడు మోటారు బైకుతో వేగంగా వచ్చాడు. హోంగార్డు చింతల ప్రతాప్ రెడ్డి ఆ బాలుడిని అటకాయించేందుకు ప్రయత్నించగా, మరింత వేగంగా వెళ్లిన బాలుడు నేరుగా హోంగార్డును ఢీకొట్టాడు. దీంతో అతని కాలు విరిగింది. దీంతో బైక్‌ను స్వాధీనం చేసుకుని, బాలుడిని, ఖాదర్‌హుస్సేన్ గుట్ట పాలెంలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న అతని తండ్రి ఖాదర్ హుస్సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరువురి పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. గాయపడిన హోంగార్డును ఆసుపత్రికి తరలించారు.

ఆటో ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

పులివెందుల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ హాజీవలి తెలిపారు. పులివెందులకు చెందిన ప్రభాకరరెడ్డి ఆదివారం తన ఆటోలో తొండూరు మండలంలోని కృష్ణంగారిపల్లె నుంచి పులివెందులకు వస్తూ పట్టణ సమీపంలో చిత్తుకాగితాలు ఏరుకునే ఓ గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొన్నాడు. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో బోల్తా పడింది మృతుడికి 55 నుంచి 60 ఏళ్ల వయసుంటుందని, ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళకు చేయి విరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంపై కేసునమోదు చేసినట్లు వివరించారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య



చికిత్స పొందుతున్న సుమన్

ఖాజీపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సుబ్బరాయుడు కథనం మేరకు మండల పరిధిలోని చెర్లోపల్లెకు చెందిన దిగినేని సుమన్ (18) కొద్దిరోజులుగా అనారోగ్యంతో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స చేయించుకొనేవాడు. ఆదివారం ఉదయం కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటికి కేకలు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుబ్బయ్య తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

రామసముద్రం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గజ్జిగానిపల్లెకు చెందిన వినోద్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆదివారం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామసముద్రం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

యువకుడి అదృశ్యం



అదృశ్యమైన రామచంద్ర

కడప క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలోని చిన్న చౌకు రెడ్డికాలనీకి చెందిన దాక్లా ఉదయ రామచంద్ర (19) అనే యువకుడు ఈ నెల 27న అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్‌ఐ తెలిపారు. కడప నగరంలోని గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తి చేసిన రామచంద్ర వేసవి సెలవుల్లో తన తల్లిదండ్రులకు పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేవాడు. పదిరోజుల నుంచి దిగులుగా ఉండడంతో తల్లిదండ్రులు కారణం అడిగినా సమాధానం చెప్పలేదు. ఈ నెల 27 మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిన అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని తండ్రి సుబ్బరామయ్య చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఆచూకీ తెలిసిన వారు పోలీసు ఇన్‌స్పెక్టర్ సెల్ నెం.9121100520, ఎస్‌ఐ సెల్ నెం.9121100521, 9121100522లకు ఫోను చేసి సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

జూద కేంద్రాలపై దాడులు.. పది మంది అరెస్టు

● రూ.20,470 నగదు స్వాధీనం

పులివెందుల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న జూద కేంద్రాలపై దాడులు నిర్వహించారు. అర్బన్ సీఐ చాంద్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు ఈ జూద కేంద్రాలపై దాడులు చేశారు. అక్కడ జూదమాడుతున్న పది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.20, 470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

భూమిని ఆక్రమించారు.. న్యాయం చేయండి

● అధికారులకు బాధితుడి వినతి



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు ఈశ్వర్‌రెడ్డి

కడప మారుతీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణబారి నుంచి తమ భూమిని కాపాడాలని చింత కొమ్మదిన్నె మండలం లింగారెడ్డిపల్లెకు చెందిన బి.ఈశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని కోరు తున్నాడు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాడు. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లెలోని సర్వేనెంబర్ 54/1సిలో 27 సెంట్లు, 54/2సిలో 50 సెంట్లు చొప్పున 77 సెంట్ల భూమిని 20 ఏళ్ల క్రితం కడప ఐటీఐ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించగా, ఆ భూమిని కాకుండా, రోడ్డుకు ఆనుకుని ఉన్న తమ భూమిని ఆ వ్యక్తి ఆక్రమించుకుని చదును చేసుకున్నాడని తెలిపారు. గత నెలలో ఈ విషయం పై ఎస్పీకి వినతిపత్రం అందజేయగా, ఆయన సి.కె.దిన్నె పోలీసులకు రెఫర్ చేశారన్నారు. అయితే, పోలీసులు ఆక్ర మణ దారుడికే వత్తాసు పలుకుతూ తనను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం. జిల్లా అధికారులు మానవత్వంతో స్పందించి సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయాలని కోరాడ. సమావేశంలో బి. మల్లికార్జునరెడ్డి, వీరమ్మ, నాగమునెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం!

● ఏజెంటు ఇంటి వద్ద బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న తాలూకా ఎస్‌ఐ తులసి నాగప్రసాద్

కడప క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు ఆదివారం ఆందోళన చేశారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా కళాశాలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కడప చౌటుపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న రవి అలియాస్ రఫి అనే వ్యక్తి నిరుద్యోగులకు ఆశ కల్పించాడు. ఉద్యోగం కావాలంటే రూ.6.50 లక్షలు చెల్లించాలని చెప్పాడు. దీంతో జిల్లా వ్యాప్తంగా 21 మంది డబ్బు చెల్లించడంతో వారందరికీ నియామక పత్రాలు సైతం ఇప్పించాడు. అయితే ఈ నియామకాలు చెల్లవంటూ అధికారులు చెప్పడంతో తమ వద్ద డబ్బులు తీసుకున్న రఫీని వారు ప్రశ్నించగా, తాను కూడా గుంటూరుకు చెందిన వల్లి అనే వ్యక్తికి ఇచ్చానని అడ్డం తిరిగాడు.. దీంతో బాధితులు కొద్ది రోజుల క్రితం జమ్మలమడుగు ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు రవి ఆలియాస్ రఫీపై చీటింగ్ కేసు నమోదు చేశారు. కాగా, ఆదివారం బాధితులు ఏజెంటు రవి ఇంటి వద్ద ఆందోళన చేస్తుండగా తాలూకా ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏదైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, రఫిపై కేసు కూడా నమోదు చేశామని, అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆందోళన విరమించాలని చెప్పడంతో బాధితులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

● భర్తే హత్య చేశాడు: తల్లిదండ్రులు
● రాయచోటి ఆర్డీవో, డీఎస్పీ విచారణ
● బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు



హిందూజా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్డీవో, డీఎస్పీ (ఇన్‌సెట్) భర్త విజయశేఖర్ రెడ్డితో హిందూజా(ఫైల్)

పీలేరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత ఆదివారం మృతి చెందగా, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని, భర్తే హత్య చేశాడంటూ మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీలేరు పోలీసులు, మృతురాలి బంధువుల కథనం మేరకు పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ బందార్లపల్లెకు చెందిన విజయశేఖర రెడ్డి(39)కి చిత్తూరు జిల్లా తవణంపల్లెకు చెందిన జీవనజ్యోతి, లోకనాథరెడ్డి దంపతుల కుమార్తె హిందూజా(29)తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వారికి చార్విష్ రెడ్డి(04), రుషిక(02) అనే ఇద్దరు పిల్లలున్నారు. హిందూజా మృతి చెందిందంటూ ఆదివారం ఉదయం 3 గంటల సమయంలో విజయశేఖర రెడ్డి ఆమె బంధువులకు సమాచారం అందించాడు. గుండెపోటుతో చనిపోయిందని కొందరికి, బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని ఇంకొందరికి, చెరువులో దూకేసిందని మరికొందరికి చెప్పడంతో వారంతా ఆదివారం ఉదయానికి బందార్లపల్లెకు చేరుకున్నారు. విజయశేఖర రెడ్డి వివాహేతర సంబంధాల కారణంగా గతంలో భార్యభర్తల మధ్య గొడవలు, పంచాయతీలు జరిగి ఉండడంతో హిందూజా మరణంపై వారు పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ లోకేశ్ బందార్లపల్లెకు చేరుకుని విజయశేఖర రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు విషయంలో హిందూజా తల్లిదండ్రులు, బంధువులు, విజయశేఖర రెడ్డి బంధువుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తడంతో తమకు అన్యాయం జరుగుతోందంటూ వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ కృష్ణమోహన్ ఆదివారం సాయంత్రం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని విచారణ చేశారు. హిందూజా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు.

పిల్లలకు న్యాయం చేయండి

పలమనేరుకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందన్న కోపంతో అల్లుడే తమ కూతురిని హత్య చేసి ఉంటాడని హిందూజా తల్లిదండ్రులు జీవనజ్యోతి, లోకనాథరెడ్డి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ కృష్ణమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో తమ కుమార్తె, అల్లుడి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయని, భర్త మారుతాడన్న నమ్మకంతో హిందూజా ఉండేదని, చివరకు అతని చేతిలోనే కడతేరిపోయిందని విచారం వ్యక్తం చేశారు. హిందూజా పిల్లలకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సాగుకు విరామం..'పాడి'కి శ్రీకారం



చక్రాయపేట మండలంలోని పాడిపశువులు



బీళ్లుగా మారిన పంటపొలాలు

చక్రాయపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు తదితర కారణాలతో ఏటేటా నష్టాలబారిన పడుతున్న రైతు ప్రత్యామ్నాయ మార్గాలవైపు దృష్టి సారిస్తున్నాడు. సాగునీటి వనరులేవీ లేకపోవడంతో చక్రాయపేట మండలంలో కేవలం వర్షంపైనే ఆధారపడి వేరుశనగ, వరి, మామిడి పంటలు సాగు చేస్తారు. గతంలో వేరుశనగ, కంది,ఉలవ,సజ్జ, జొన్నలాంటి పంటలు దాదాపు 2000 హెక్టార్లలో సాగు చేసేవారు. ఏటేటా నష్టాల కారణంగా ప్రస్తుతం ఒక్కరు కూడా ఆయా పంటలు సాగు చేయడం లేదు. రెండు బర్రెలను పట్టుకున్న బతకవచ్చని నిర్ణయానికి వచ్చి పాడి వ్యాపారం మొదలుపెట్టారు. ప్రస్తుతం మండలంలో ప్రతిరోజు దాదాపు నాలుగు వేల నుంచి ఐదు వేల లీటర్ల పాలు విక్రయిస్తున్నట్లు సమాచారం. వీటికి అనుగుణంగా మండల కేంద్రంలో రెండు సంస్థలు పాల సేకరణ కేంద్రాలు పెట్టాయి వీటికి ప్రతి రోజూ 3,500 లీటర్ల దాకా పాలు వస్తున్నట్లు సమాచారం ప్రస్తుతం బర్రె పాలకు లీటర్‌కు రూ.83 నుంచి రూ.85 వరకూ చెల్లిస్తున్నారు. ఆవుపాలకు రూ.35 ఇస్తున్నట్లు తెలిసింది. రోజుకు ఒక బర్రె మూడు లీటర్లు ఇచ్చిన నెలకు 90 లీటర్ల పాల ఉత్పత్తి ఉంటుంది. దీంతో దాదాపు రూ.10వేల ఆదాయం లభిస్తోంది..

ఖర్చు ఎక్కువ ఆదాయం తక్కువ



రైతు పరిస్థితి నానాటికి కష్టతరం అవుతోంది. బతకడం భారమై పోతోంది. వర్షాలు లేవు, పంటలు రావు, పంటతో వచ్చిన ఆదాయం కన్నా ఆ పంటల కోసం చేసిన అప్పులు ఎక్కువ అవుతున్నాయి. దీనితో వ్యవసాయం చాలించి, మూడు బర్రెలను పెట్టుకొని డెయిరీకి పాలుపోసి జీవనం సాగిస్తున్నాం. ప నెలకు రూ.10వేల నుంచి రూ.15వేలు ఆదాయం వస్తోంది. మరో రెండు బర్రెలను కొనుక్కోవాలని అనుకుంటున్నాం.

- దయ్యం నాగేశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డిగారిపల్లె

మానసిక క్షోభకు గురిచేశారని ఫిర్యాదు

● వైసీపీ సర్పంచ్ కుటుంబంపై కేసు నమోదు

ముద్దనూరు జూన్29(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె గ్రామ సర్పంచ్ అరుణమ్మ, ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం తనపై అసభ్య పదజాలంతో కూడిన కరపత్రాలు పంచారని బీజేపీ నాయకుడు మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు .కొత్తపల్లెకు చెందిన మోహన్‌రెడ్డిపై అసభ్యకర పదాలు ముద్రించిన కరపత్రాలను గ్రామంలో విచ్చలవిడిగా వెదజల్లారు. వాటిలో మోహన్‌రెడ్డి తో పాటు అతని తల్లిని కూడా దూషించారు. మోహన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిపై కూడా దాడి చేశారు. దీంతో మోహన్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ అరుణమ్మ, భర్త రామిరెడ్డి, కుమారుడు లక్ష్మిరెడ్డి మరో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అటవీ ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు

సిద్దవటం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కడప ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కనుమలోపల్లె ఫారెస్ట్ బీట్‌లో ఆదివారం సిద్దవటం పోలీసులు తనిఖీలు చేశారు.. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం అరికట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు శివ ప్రసాద్, రాముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమంగా చెట్ల నరికివేత

వాల్మీకిపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో చెట్లు అక్రమంగా నరికివేసి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రిజర్వాయర్ కోసం ప్రభుత్వానికి భూములు అప్పగించి నష్టపరిహారం పొందిన కొందరు వృక్షాలు, ఆ భూముల్లోని అల్లనేరేడు, కొబ్బరి ఫలసాయాన్ని విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. రిజర్వాయర్ ప్రాంతంలో ఈ అక్రమాలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కళాంజలిఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు

రాజంపేట టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కళాంజలి సాంస్కృతిక కళా పీఠం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రముఖ సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఘంటసాల జ్ఞాపకార్థం ప్రతి ఏడాది ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు ఆకాశవాణి, సంగీత విద్వాంసుడు గుణకల సుబ్బరాయుడు, నవోదయ సంగీత స్కూల్ విద్వాంసుడు వెంకటాద్రి, నిర్వాహకులు సత్యవతిదేవి, ఎస్.రాధిక, పలు ప్రాంతాల నుంచి వచ్చిన గాయని గాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

నాగారపమ్మకు ఘనంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ తల్లి

సుండుపల్లె, జూన్29(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ ఈడిగ పల్లె సమీపంలో వెలిసిన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తు లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలను ఆలయ అర్చకులు సమర్పించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట వంటి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి తలనీలాలను సమర్పించారు. భక్తులు టెంకాయలు కొట్ట మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ఆలయ సమీపంలోని మామిడి తోటల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గంగమ్మ తల్లికి పూజలు



అలంకరణలో గంగమ్మ తల్లి

లక్కిరెడ్డిపల్లె, జూన్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన గంగమ్మ తల్లికి ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రతి ఆదివారం అమ్మవారి దర్శనం కోసం వేల సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఈ ఆదివారం కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు.

'ఉపాధిలో అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి'



మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

రైల్వేకోడూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని కడప నగర మేయర్ సురేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం రైల్వేకోడూరు వైసీపీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ చట్టం మేరకు ఉపాధి పనులు గ్రామ పం చాయతీ ద్వారానే జరిపించాలన్నారు. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన నిధులు రూ.1,150 కోట్లు స్థానిక సంస్థలకు తక్షణమే జమచేయాలన్నారు. ఈ బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ జోక్యం నివారించాలన్నారు. వైసీపీ పట్టణ అధ్యక్షులు సీహెచ్ రమేష్‌బాబు, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్‌బాషా, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

'చంద్రబాబును విమర్శించే స్థాయి సుగవాసికి లేదు'



మాట్లాడుతున్న వెంకటనరసయ్య

ఒంటిమిట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని విమర్శించే స్థాయి సుగవాసి బాలసుబ్రమణ్యంకు లేదని కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక హరిత హోటల్‌లో టీడీపీ మండల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో సుగవాసి బాలసుబ్రమణ్యంను రాజంపేట అసెంబ్లి అభ్యర్థిగా పార్టీ నిర్ణయిచిందన్నారు. ప్రచారం చేయకపోవడంతో ఓడిపోయారన్నారు. అలాగే ఆయన తండ్రి పాలకొండ్రాయుడిని రెండుసార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా చేశారన్నారు. అలాంటి పార్టీని విమర్శించడం సరికాదన్నారు. ఆరోపణలు వెనక్కు తీసుకోవాలన్నారు. ఉద్దిమడుగు ప్రాజెక్టుకు సంబంధించి ఒక ఇటుక కూడా వేయలేదన్నారు. ఈ ప్రాజెక్టుకు నిధులు ఎందుకు మంజూరు చేశారో తెలియలేదన్నారు. మాజీ జడ్పీటీసీ దొంగ డీకేటీ పట్టాలను పొంది సుమారు రూ.25 కోట్లు ఈ ప్రాజెక్టు కింద నష్టపరిహారంగా స్వాహా చేశారన్నారు. అది సరిపోక మరో రూ.34 కోట్లు చెల్లించాలని కోర్టును ఆశ్రయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయంపై రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, రాంప్రసాద్‌రెడ్డిలకు ఫిర్యాదు చేశామని, అక్రమంగా స్వాహా చేసిన రూ.25 కోట్లను రికవరీ చేయించాలని తెలిపామన్నారు. టీడీపీ నాయకులు పాముూరు సుబ్రమణ్యం, ఎంపీపీ ప్రతినిధి నల్గొండ వెంకటసుబ్బారెడ్డి, చింతరాజుపల్లె సర్పంచ్ ప్రతినిధి బొడ్డు వెంకటరమణనాయుడు, మామిళ్ల ఈశ్వరయ్య, రేవిళ్ల బాలమునెయ్య, మోదుగుల నరసింహులు, మాజీ సర్పంచ్ నారాయణ, బోగా శంకరయ్య, మామిళ్ల రామక్రిష్ణయ్య, బుజ్జితోపాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వీరబల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అలరించింది. ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులు వివిధ స్థాయిలో ఉన్న వారు అందరూ ఆదివారం హాజరయ్యారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివిన విద్యార్థులకు 25 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని సందడి చేశారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు.చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. నాడు గురువులు నేర్పిన క్రమశిక్షణ, చదువుతో ఈ రోజు వివిధ స్థాయిల్లో ఉన్నామని తెలిపారు. పూర్వ విద్యార్థులు తమకు విద్యనుబోధించిన నాటి ఉపాధ్యాయులు రామకృష్ణమూర్తి, మడితాటి నరసింహారెడ్డి, శ్రీనివాసులు, శోభన్‌బాబు, మల్లేశం, హరినాథలను దుశ్శాలువాలతోనూ, పూలమాలలతో జ్ఞాపికలను ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు, పాఠశాల పూర్వ విద్యార్థి గిరిబాబు, మస్తాన్‌లు మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులు కలుసుకొని తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సన్మానించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.10 వేలను పాఠశాల ఉపాధ్యాయులు రామ్మోహన్‌కు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి మరింత సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు నాటి రోజులను గుర్తుకు చేసుకొని ఓల్డ్ ఈస్ గోల్డ్ అనే మాట మరోసారి నిరూపితమైందని కొనియాడారు. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో ఆ పాఠశాలకు మోక్షం

● రూ.42 లక్షలు మంజూరు చేసి ప్రహరీ నిర్మాణం పూర్తి చేసిన వైనం





విద్యార్థులతో కలిసి భోంచేస్తున్న కలెక్టర్ శ్రీధర్(ఫైల్)... కలెక్టర్ చొరవతో నిర్మించిన ప్రహరీ

చిన్నమండెం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చామకూరి శ్రీధర్ చొరవతో ఆ పాఠశాలకు మోక్షం లభించింది. రూ.42 లక్షలు మంజూరు చేయించి ప్రహరీ నిర్మాణ పనులు పూర్తి చేయించడంతో ఆ పాఠశాల విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇవీ... చిన్నమండెం మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు విద్యార్థినులను పంపించాలంటే తల్లిదండ్రులు ఒకప్పుడు భయపడేవారు. మం డల కేంద్రానికి శివారులో మాండవ్యనది ఒ డ్డున ఈ పాఠశాల ఉండటంతో పాఠశాల చు ట్టూ చెట్లు, ముళ్లపొదలు అధికంగా ఉండేవి. దీంతో తల్లిదండ్రులు ఆడపిల్లలను ఆ పాఠశాలకు పంపించాలంటే భయపడేవారు. దీనికి తోడు పాఠశాల ప్రాంగణంలో పందులు స్వైర విహారం చేసేవి. పాఠశాల ఆవరణం లోపల ఉన్న ఒక గదిలో పశువులను కట్టేసేవారు. చాలా సార్లు ఎంపీడీవో, ఇతర అధికారులకు పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో సాధారణ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ గర్ల్స్ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి అసౌకర్యాలను, విద్యార్థుల సమస్యలు కళ్లారా చూసిన ఆయన చలించిపోయారు. పాఠశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అలాగే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రహరీ గోడ నిర్మించాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ కింద రూ.42 లక్షలు మంజూరు చేయించి ఆగమేఘాల మీద పనులు మొదలుపెట్టి చకచకా పూర్తి చేయించారు. దీంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ చొరవతో పాఠశాల రూపురేఖలే మారిపోయాయని విద్యార్థులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

7న మాదిగ మహామేళాను జయప్రదం చేయండి

● ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు

రాయచోటిటౌన్, జూన్29(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 31వ అవిర్భావ దినాన్ని పురస్కరించుకొని జూలై 7న చేపట్టనున్న మాదిగల మహామేళాను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గల అంబేడ్కర్ ప్లెక్సీ వద్ద ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఈదుముడిలో 1994లో పురుడు పోసుకున్న ఎంఆర్‌పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) ఉద్యమం 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూలై 7న ఒంగోలులో మాదిగల మహామేళాను నిర్వహిస్తారన్నారు. మాదిగల 30 సంవత్సరాల ఉద్యమ ఆకాంక్షను గౌరవిస్తూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి విద్య, ఉద్యోగాల్లోనే కాకుండా ఉపాధి, సంక్షేమ, రాజకీయ రంగాల్లో మాదిగ, ఉపకులాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు బసయ్య, వెంకట్రమణ, రెడ్డెయ్య, మహేశ్, జ్యోతిశ్, కార్తీక్, రాఖి, సాయి, రెడ్డి, నరసింహా, కౌసిక్, సంజీవ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్రగా శ్రీవారి భక్తులు

సిద్దవటం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం గుడిపాడు గ్రామస్థులు తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. ఈ పాదయాత్ర ఆదివారం భాకరాపేట మీదుగా వెళ్లింది. భక్తులు మాట్లాడుతూ జూన్ 29న ఉదయం ఆరుగంటలకు తమ గ్రామం నుంచి సుమారు 85 మంది నడుచుకుంటూ తిరుమలకు బయలుదేరామన్నారు. జూలై 5న తిరుమల దర్శనానికి వెళతామన్నారు. సకాలంలో వర్షాలు పడి రైతు ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి భక్తులు కొండయ్య, వెంకటరమణ, రమాదేవి, గంగమ్మ, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్ పోటీలు



మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ట్రోఫీ అందుకుంటున్న వర్మ

నందలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతి అరవపల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అరవపల్లె క్రికెట్ లీగ్ ఆధ్వర్యంలో మండలస్థాయిలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లోని మ్యాచ్‌లు రసవత్తరంగా ఆడుతున్నాయి.

మంటపంపల్లె జట్టుపై దుర్గాపురం విజయం

ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో మంటపంపల్లె డాబాలెవన్ జట్టుపై దుర్గాపురం జట్టు విజయం సాధించింది.టాస్ గెలిచిన దుర్గాపురం జట్టు మంటపంపల్లె జట్టును బ్యాటింగ్‌కు ఆహ్వానించగా ఆ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 110 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన దుర్గాపురం జట్టు 11.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పాయి 111 పరుగులు చేసి విజయం సాధించింది. విజేత జట్టులో వర్మ 35 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ సొంతం చేసుకున్నాడు.

ఆడపూరుపై లేబాక జట్టు విజయం

మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో అంబేద్కర్ లెవన్స్ ఆడపూరు జట్టుపై లేబాక జట్టు విజయం సాధించింది. ముందు బ్యాటింగ్ చేసిన ఆడపూరు జట్టు నిర్ణీత 12 ఓవర్లలో ఏడు వికెట్లను కోల్పోయి 96 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన లేబాక జట్టు 10.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసి విజయం సాధించింది. లేబాక జట్టులో మధు నాలుగు వికెట్లను తీసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. ఈ రెండు మ్యాచ్‌లకు అంపైర్లుగా బన్నీ, హరి, స్కోరర్‌గా నవీన్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అరవపల్లె క్రికెట్ లీగ్ సభ్యులు అరుణ్, బుల్లెట్ హరి, నవీన్, రాము, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల ద్వారానే అహంకారం నశిస్తుంది

● మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి

రాయచోటిటౌన్, జూన్29(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల ద్వారానే అహంకారం నశిస్తుందని మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ఎస్. రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ఆర్ కల్యాణ మండపంలో మానవత సంస్థ ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడిగా బ్రహ్మానందరెడ్డి, రాయచోటి అధ్యక్షుడిగా అంకం జయచంద్రారెడ్డితో పాటు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం రాయచోటి మానవత చైర్మన్ అరమాటి గంగిరెడ్డి, పూర్వపు అధ్యక్షుడు గాండ్లపెంట ఖాదర్‌బాషా, కన్వీనర్ చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మానవత వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు నిమ్మనపల్లి సహదేవరెడ్డి, అవటాల రామాంజుల్‌రెడ్డి, జిల్లా విద్యా కమిటీ సభ్యులు రాటాల గోపి, రాయచోటి శాఖ గౌరవాధ్యక్షుడు బెల్లం లోకనాథరెడ్డి హాజరయ్యారు. 2025-26 ఉమ్మడ కడప జిల్లా, రాయచోటి మండల కమిటీ నూతన కార్యవర్గ జిల్లా సెక్రటరీ రామానాయుడు, కోశాధికారి హరికుమార్, ఉపాధ్యక్షుడు అల్లం రెడ్డెప్పరెడ్డి, సంయుక్త కార్యదర్శి కావలి కృష్ణతేజ, ఈసీ చైతన్య చవ్వా కృష్ణారెడ్డి, ఈసీ విద్య డీ. రామిరెడ్డి, ఈసీ అత్యవసర పాలకొండరాయుడు, రాయచోటి కమిటీ సెక్రటరీ బుక్కే నాగేశ్వర్ నాయక్, కోశాధికారి టేకూరి నాగార్జున, ఉపాధ్యక్షుడు పురం మురళీమోహన్, సంయుక్త కార్యదర్శి సాధు బసిరెడ్డి, ఈసీ చైతన్య కేతంరెడ్డి, హ రినాథరెడ్డి, ఈసీ విద్య మూడే రంజిత్‌నాయక్, ఈసీ ఆరోగ్య దుర్గం షబ్బీర్, ఈసీ అత్యవసర మే కల శివారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.

చిట్వేలి శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్వేలి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మానవతా స్వ చ్ఛంద సంస్థ చిట్వేలిశాఖ నెలవారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ మేరకు ఆదివారం సాయివికాస్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో సంస్థ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంస్థ అధ్యక్షులుగా తిరుమల విశ్వనాథం, కార్యదర్శి కుంభగిరి మునిరావు, కోశాధికారిగా సుబ్రమణ్యంరెడ్డి, చైర్మన్ కె.సాయిరాం, కో చైర్మన్ రంగారెడ్డి, గౌరవ డైరెక్టర్ గుత్తి నరసింహా, డైరెక్టర్ బోర్డు సుబ్బరాజు, సంయుక్త కార్యదర్శి కంచర్ల సుధీర్‌రెడ్డి, అడ్వైజర్ బోర్డు మెంబర్లు కావేరి, చంద్ర, సువ్వారపు హరి, ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు.

రేపన సుధాకర్‌కు మదర్ థెరీసా అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రేపన సుధాకర్

సుండుపల్లె, జూన్29(ఆంధ్రజ్యోతి):సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని మాధురి హైస్కూల్‌క రస్పాండెంట్ డాక్టర్ రేపన సుధాకర్‌కు మదర్ థెరీసా అవార్డును ప్రముఖ ఫేస్ గ్రూప్ సంస్థ అందజేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఢిల్లీ క్యాబినెట్ మంత్రి మజీంధర్‌సింగ్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. మదర్ థెరిసా అవార్డును అందుకోవడం సంతోషదాయకమని కరస్పాండెంట్ డాక్టర్ రేపన సుధాకర్ తెలియజేశారు. ఈ అవార్డుకు ఎంపిక చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాధురి స్కూల్ ఉపాధ్యాయ బృందం ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

'మీడియా వ్యవస్థపై దాడి దుర్మార్గం'



మాట్లాడుతున్న జనసేన పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ

రాజంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మీడియా వ్యవస్థపై దాడి దుర్మార్గం అని రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా పని చేస్తున్న పత్రిక కార్యాలయాలపై దాడులు చేయడం సరి కాదన్నారు. ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న ఎలక్ట్రాన్ మీడియా, ప్రింట్ మీడియాల స్వేచ్ఛను హరించినవారవమవుతామన్నారు. టీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంత మంది మహాటీవీ కార్యాలయంపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. పత్రికల్లో వస్తున్న కథనాలు సరికానప్పుడు చట్టపరమైన చర్యలు చేపట్టవచ్చునన్నారు. జనసేన పార్టీ నేతలు, రాయలసీమ కన్వీనర్ జోగినేని మణి, కడప రమణ, కేఎస్ నరసింహ, మాజీ సర్పంచ్ ఎంఎల్ నరసయ్య, కొరముట్ల హరి, అబ్బిగారి గోపాల్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యోగా సాధనకు ముగ్గురు ఎంపిక

నందలూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతికి చెందిన ముగ్గురు యోగా సాధనలో మండలం నుంచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. 35 నుంచి 50 సంవత్సరాల విభాగంలో గెలివి నాగసురేంద్రకుమార్ మొదటి స్థానం, నీరజా రెండో స్థానంలో నిలిచారు. అదేవిధంగా 18 సంవత్సరాల విభాగంలో ధోణిచరణ్ మొదటి స్థానంలో నిలిచాడు.వీరిని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ శాలువాతో సత్కరించారు. జిల్లా స్థాయికి ఎంపికైన వీరిని మండలంలోని పలువురు అభినందించారు.

ఎఫ్‌సీఐ రాష్ట్ర కమిటీ మెంబర్‌గా గడ్డం చెంగల్‌రాజు



ఓబులవారిపల్లె, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ స్టేట్‌లెవల్ కన్సల్టేటివ్ కమిటీ మెంబరుగా భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం చెంగల్‌రాజును నియమించారు. మండలంలోని బొమ్మవరంలో జన్మించిన ఆయన ఉన్నత విద్యాభ్యాసం చేసే రోజుల్లో భారతీయ జనతాపార్టీకి ఆకర్షితుడై నాటి నుంచి నేటివరకు ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. గ్రామీణ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు పార్టీకి సేవందిస్తున్నారన్నారు.

తండ్రి అడుగుజాడల్లో నడుస్తా

● సుగవాసి ప్రసాద్‌బాబు



పాలకొండ్రాయుడి సంస్మరణ సభలో మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

చిన్నమండెం, జూన్29(ఆంధ్రజ్యోతి): తన తండ్రి, దివంత నేత, రాయచోటి టీడీపీ సీనియర్ నాయకుడు సుగవాసి పాలకొండ్రాయుడు సూచించిన అడుగుజాడల్లోనే నడుస్తానని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. చిన్నమండెం మండలంలోని మల్లూరు కొత్తపల్లి ప్రజలు నిర్వహించిన పాలకొండ్రాయుడి సంస్మరణ సభలో సుగవాసి ప్రసాద్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా ఈ పనులన్నీ మీ తండ్రి చేసినవేనని ఆ గ్రామస్థులు చెబుతుంటే ఎంతో ఆ నందంగా ఉందన్నారు. పార్టీ పెట్టిన నాటి నుంచి తుది శ్వాస విడిచే వరకు తన తండ్రి పార్టీలోనే కొనసాగారని గుర్తు చేశారు. అయితే తనను కొందరు టీడీపీ నుంచి వెళ్లగొట్టాలని చూస్తున్నారని, తాను టీడీపీలోనే కొనసాగుతానని పేర్కొన్నారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ సతీశ్, బెల్లం కిశోర్‌రెడ్డి, నాగభూసణం, మల్లూరు రెడ్డిప్రసాద్, ఎర్ర బాషా, ప్రతాప్‌నాయుడు, తోహిద్, సైఫుల్లా, రహంతుల్లా, సుగవాసి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.


సింగిల్‌విండో అధ్యక్షులుగా సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి

రామాపురం, జూన్29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సరస్వతీపల్లి, కొలిమివాండ్లపల్లె సింగిల్‌విండో అధ్యక్షులుగా రామాపురం మండలం చిట్లూరు గ్రామానికి చెందిన గాలివీటి సురేందర్‌రెడ్డి, సరస్వతీపల్లె సింగిల్‌విండో అధ్యక్షుడిగా రాచపల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి, కొలిమివాడ్లపల్లె సింగిల్‌విండో అధ్యక్షుడిగా ఎన్నిక కానున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలోని టీడీపీ నాయకులు స్వీట్లు పంచిపెట్టారు. ఈ పదవులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఎంఎల్ వెంకట్రామిరెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, రామకృష్ణగౌడ్, తుమ్మల ఓబులేసు, దేవదర్శన్ రెడ్డి, రామాంజేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'తక్షణమే రైతు భరోసా ఇవ్వాలి'

లక్కిరెడ్డిపల్లె, జూన్29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగమైన రైతు భరోసా రూ.20 వేలు తక్షణమే ఇవ్వాలని రాయచోటి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం దప్పేపల్లె, డీ.రామాపురం, గొల్లపల్లి, కొండపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలు రైతులతో మాట్లాడారు. అలాగే పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డెయ్య, సిద్దారెడ్డి, సూర్యారెడ్డి, చాంద్‌బాషా పాల్గొన్నారు.

సాయి డిగ్రీ కళాశాల ప్రతిభ



బొకే అందిస్తున్న పెంచలయ్య

రైల్వేకోడూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): యోగి వేమన యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో రైల్వేకోడూరు సాయి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ర్యాంకులు పొందారన్నారు. కళాశాల స్థాపన నుంచి అద్భుతమైన ఫలితాలు విద్యార్థులు సాధిస్తున్నారని తెలిపారు.

మోటారు సైకిల్ ఢీకొని
హోంగార్డుకు గాయాలు


చికిత్స పొందుతున్న ప్రతాప్ రెడ్డి

కలికిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఓ బాలుడు బైక్ నడుపుతూ హోంగార్డును ఢీకొన్నాడు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషను ముందు పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా మహ్మద్ ఫజారుద్దీన్ అనే బాలుడు మోటారు బైకుతో వేగంగా వచ్చాడు. హోంగార్డు చింతల ప్రతాప్ రెడ్డి ఆ బాలుడిని అటకాయించేందుకు ప్రయత్నించగా, మరింత వేగంగా వెళ్లిన బాలుడు నేరుగా హోంగార్డును ఢీకొట్టాడు. దీంతో అతని కాలు విరిగింది. దీంతో బైక్‌ను స్వాధీనం చేసుకుని, బాలుడిని, ఖాదర్‌హుసేన్ గుట్ట పాలెంలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న అతని తండ్రి ఖాదర్ హుస్సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరువురి పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్ రెడ్డి తెలిపారు. గాయపడిన హోంగార్డును ఆసుపత్రికి తరలించారు.

ఆటో ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

పులివెందుల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ హాజీవలి తెలిపారు. పులివెందులకు చెందిన ప్రభాకర్‌రెడ్డి ఆదివారం తన ఆటోలో తొండూరు మండలంలోని కృష్ణంగారిపల్లె నుంచి పులివెందులకు వస్తూ పట్టణ సమీపంలో చిత్తుకాగితాలు ఏరుకునే ఓ గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొన్నాడు. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో బోల్తా పడింది మృతుడికి 55 నుంచి 60 ఏళ్ల వయసుంటుందని, ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళకు చేయి విరిగిందని తెలిపారు. ఈ ప్రమాదంపై కేసునమోదు చేసినట్లు వివరించారు.

కడుపునొప్పి తాళలేక యువకుడి ఆత్మహత్య


చికిత్స పొందుతున్న సుమన్

ఖాజీపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సుబ్బరాయుడు కథనం మేరకు మండల పరిధిలోని చెర్లోపల్లెకు చెందిన దిగినేని సుమన్ (18) కొద్దిరోజులుగా అనారోగ్యంతో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులలో చికిత్స చేయించుకొనేవాడు. ఆదివారం ఉదయం కడుపునొప్పి తీవ్రం కావడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటికి కేకలు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

రామసముద్రం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గజ్జిగానిపల్లెకు చెందిన వినోద్‌కుమార్ ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆదివారం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామసముద్రం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఇతని పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

యువకుడి అదృశ్యం


అదృశ్యమైన రామచంద్ర

కడప క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలోని చిన్న చౌకు రెడ్డికాలనీకి చెందిన దాక్లా ఉదయ రామచంద్ర (19) అనే యువకుడు ఈ నెల 27న అదృశ్యమైనట్లు చిన్నచౌకు ఎస్ఐ తెలిపారు. కడప నగరంలోని గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తి చేసిన రామచంద్ర వేసవి సెలవుల్లో తన తల్లిదండ్రులకు పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేవాడు. పదిరోజుల నుంచి దిగులుగా ఉండడంతో తల్లిదండ్రులు కారణం అడిగినా సమాధానం చెప్పలేదు. ఈ నెల 27 మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిన అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని తండ్రి సుబ్బరామయ్య చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఆచూకీ తెలిసిన వారు పోలీసు ఇన్‌స్పెక్టర్ సెల్ నెం.9121100520, ఎస్ఐ సెల్ నెం.9121100521, 9121100522లకు ఫోను చేసి సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

జూద కేంద్రాలపై దాడులు.. పది మంది అరెస్టు

● రూ.20,470 నగదు స్వాధీనం

పులివెందుల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న జూద కేంద్రాలపై దాడులు నిర్వహించారు. అర్బన్ సీఐ చాంద్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు ఈ జూద కేంద్రాలపై దాడులు చేశారు. అక్కడ జూదమాడుతున్న పది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.20, 470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు.

భూమిని ఆక్రమించారు.. న్యాయం చేయండి

● అధికారులకు బాధితుడి వినతి


పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితుడు ఈశ్వర్‌రెడ్డి

కడప మారుతీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆక్రమణదారి నుంచి తమ భూమిని కాపాడాలని చింత కొమ్మదిన్నె మండలం లింగారెడ్డిపల్లెకు చెందిన బి.ఈశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని కోరు తున్నాడు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాడు. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లెలోని సర్వేనెంబర్ 54/1సిలో 27 సెంట్లు, 54/2సిలో 50 సెంట్లు చొప్పున 77 సెంట్ల భూమిని 20 ఏళ్ల క్రితం కడప ఐటీఐ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించగా, ఆ భూమిని కాకుండా, రోడ్డుకు ఆనుకుని ఉన్న తమ భూమిని ఆ వ్యక్తి ఆక్రమించుకుని చదును చేసుకున్నాడని తెలిపారు. గత నెలలో ఈ విషయం పై ఎస్పీకి వినతిపత్రం అందజేయగా, ఆయన సి.కె.దిన్నె పోలీసులకు రెఫర్ చేశారన్నారు. అయితే, పోలీసులు ఆక్ర మణ దారుడికే వత్తాసు పలుకుతూ తనను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం. జిల్లా అధికారులు మానవత్వంతో స్పందించి సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయాలని కోరాడ. సమావేశంలో బి. మల్లికార్జునరెడ్డి, వీరమ్మ, నాగమునెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ వర్కర్ల ఆకలి కేకలు

● 10 నెలలుగా అందని వేతనాలు ● కలెక్టర్ ఒప్పుకోలేదని అధికారుల మెలిక ● కలెక్టర్‌కు పీలేరు ఎమ్మెల్యే లేఖ


పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

పీలేరు రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు సుమారు ఎనిమిదేళ్ల క్రితం పీలేరులో 26 వాటర్ ప్యూరిఫైయింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ఉచితంగా ప్రతి ఇంటికీ రోజుకు రెండు క్యాన్ల చొప్పున తాగునీరు అందిస్తున్నారు. వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నమైనా ఈ ప్లాంట్లు మాత్రం విజయవంతంగా ప్రజలకు తాగునీరు అందించాయి. ఈ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలు నిర్వహించేందుకు 26 మంది వర్కర్లను నియమించారు. వీరిలో 11 మందికి పీలేరు గ్రామ పంచాయతీ నిధుల నుంచి, మిగిలిన 15 మందికి డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ నుంచి ఒక్కొక్కరికి నెలకు రూ.7,200 చొప్పున వేతనాలు చెల్లించేవారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికార పార్టీ నేతలు వైసీపీ హయాంలో నియమించిన వర్కర్లను తొలగించి, కొత్తవారిని నియమిం చారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.6 వేలు చొప్పున మొదటి మూడు నెలలు వేతనాలు చెల్లించారు. ఈ నేపథ్యంలో పీలేరు మేజర్ గ్రామ పంచాయతీలో వైసీపీ హయాంలో భారీగా నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపణలు వచ్చాయి. దీంతో మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ ఈ ఆరోపణలపై విచారణ నిర్వహించి సుమారు రూ. 1.50 కోట్లు పక్కదారి పట్టినట్లు తేల్చింది. దీంతో పీలేరు సర్పంచ్ ఎస్.హబీబ్ బాషా, ఇన్‌చార్జి సర్పంచ్ జీనత్ సఫీ చెక్‌పవర్ రద్దు చేశారు. గతంలో ఇక్కడ ఈవోలుగా పనిచేసిన ముగ్గురు సస్పెన్షన్‌కు గురయ్యారు. కలెక్టర్, డీపీవో అనుమతి లేకుండానే వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న వర్కర్లకు పంచాయతీ నిధుల నుంచి జీతాలు చెల్లించడం నిధుల దుర్వినియోగంగా ఈ కమిటీ భావించి, వాటర్ ప్లాంట్లలో పనిచేసే వర్కర్లకు వేతనాల చెల్లింపు ఆపేశారు. దీంతో వారికి వేతనాలు చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలని పంచాయతీ పాలక వర్గం కలెక్టర్‌కు విన్నవించుకుంది.


యర్రరెడ్డి గుట్ట వాటర్ ప్లాంట్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న ప్రజలు

అయితే పంచాయతీ నిధుల నుంచి వేతనాలు ఇవ్వడం కుదరదని, వాటర్ ప్లాంట్ల నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఆపరేటర్ జీతాలు, ఇతర అవసరాల కోసం వాటర్‌క్యాన్లకు ప్రజల నుంచి కనీస రుసుము వసూలు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

సమస్య పరిష్కారానికి నేతల యత్నం

జీతాలు ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురౌతున్న వర్కర్లు ప్లాంట్ల నిర్వహణపై అనాసక్తి చూపుతున్నారు. ఇంకెంత కాలం ఇలా వెట్టిచాకిరీ చేయాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 26 మినరల్ ప్లాంట్లలో నీరు ఉచితంగా ఇవ్వగా, ఇప్పుడు ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని అధికార పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. ఎలాగైనా పెండింగ్ జీతాలు ఇప్పించి సమస్య పరిష్కరించాలని యత్నిస్తున్నారు.

పెండింగ్ జీతాలపై ఆరా....

స్థానిక పంచాయతీ కార్యాలయంలో మూడు రోజుల క్రితం పీలేరు అభివృద్ధి కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీతాల పెండింగ్ విషయం కమిటీ చర్చించింది. ఏదో విధంగా జీతాలు చెల్లించాలని, అనంతరం వాటర్ ప్లాంట్ల నిర్వహణకు ప్రత్యామ్నాయ మార్గం ఆలోచించాలని నిర్ణయం తీసుకుంది. ఇక ఎంతో కాలం వర్కర్లను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని కమిటీ నిర్ణయించినట్లు సమాచారం.

కలెక్టర్‌కు ఎమ్మెల్యే లేఖ...



వాటర్ ప్లాంట్ల వద్ద పనిచేస్తున్న 26 మంది వర్కర్లకు పది నెలల జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి కలెక్టర్‌కు లేఖ రాశారు. ఆ లేఖను కలెక్టర్‌కు పంపించాం. ఆయన తీసుకొనే నిర్ణయంపై జీతాల చెల్లింపు ఆధారపడి ఉంటుంది

- లతీఫ్‌ఖాన్, ఇన్‌చార్జి ఈవో, పీలేరు

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం!

● ఏజెంటు ఇంటి వద్ద బాధితులు ఆందోళన


ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న తాలూకా ఎస్ఐ తులసి నాగప్రసాద్

కడప క్రైం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలిప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు ఆదివారం ఆందోళన చేశారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా కళాశాలల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కడప చౌటుపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న రవి అలియాస్ రఫి అనే వ్యక్తి నిరుద్యోగులకు ఆశ కల్పించాడు. ఉద్యోగం కావాలంటే రూ.6.50 లక్షలు చెల్లించాలని చెప్పాడు. దీంతో జిల్లా వ్యాప్తంగా 21 మంది డబ్బు చెల్లించడంతో వారందరికీ నియామక పత్రాలు సైతం ఇప్పించాడు. అయితే ఈ నియామకాలు చెల్లవంటూ అధికారులు చెప్పడంతో తమ వద్ద డబ్బులు తీసుకున్న రఫీని వారు ప్రశ్నించగా, తాను కూడా గుంటూరుకు చెందిన వల్లి అనే వ్యక్తికి ఇచ్చానని అడ్డం తిరిగాడు.. దీంతో బాధితులు కొద్ది రోజుల క్రితం జమ్మలమడుగు రాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు రవి అలియాస్ రఫీపై చీటింగ్ కేసు నమోదు చేశారు. కాగా, ఆదివారం బాధితులు ఏజెంటు రవి ఇంటి వద్ద ఆందోళన చేస్తుండగా తాలూకా ఎస్ఐ తులసి నాగప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏదైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, రఫిపై కేసు కూడా నమోదు చేశామని, అతనిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆందోళన విరమించాలని చెప్పడంతో బాధితులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

● భర్తే హత్య చేశాడు: తల్లిదండ్రులు
● రాయచోటి ఆర్డీవో, డీఎస్పీ విచారణ
● బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు


హిందూజా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్డీవో, డీఎస్పీ (ఇన్‌సెట్) భర్త విజయశేఖర్ రెడ్డితో హిందూజా (ఫైల్)

పీలేరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత ఆదివారం మృతి చెందగా, వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని, భర్తే హత్య చేశాడంటూ మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీలేరు పోలీసులు, మృతురాలి బంధువుల కథనం మేరకు పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ బందార్లపల్లెకు చెందిన విజయశేఖర రెడ్డి(39)కి చిత్తూరు జిల్లా తవణంపల్లెకు చెందిన జీవనజ్యోతి, లోకనాథరెడ్డి దంపతుల కుమార్తె హిందూజా(29)తో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వారికి చార్విష్ రెడ్డి(04), రుషిక(02) అనే ఇద్దరు పిల్లలున్నారు. హిందూజా మృతి చెందిందంటూ ఆదివారం ఉదయం 3 గంటల సమయంలో విజయశేఖర రెడ్డి ఆమె బంధువులకు సమాచారం అందించాడు. గుండెపోటుతో చనిపోయిందని కొందరికి, బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని ఇంకొందరికి, చెరువులో దూకేసిందని మరికొందరికి చెప్పడంతో వారంతా ఆదివారం ఉదయానికి బందార్లపల్లెకు చేరుకున్నారు. విజయశేఖర రెడ్డి వివాహేతర సంబంధాల కారణంగా గతంలో భార్యభర్తల మధ్య గొడవలు, పంచాయతీలు జరిగి ఉండడంతో హిందూజా మరణంపై వారు పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ లోకేశ్ బందార్లపల్లెకు చేరుకుని విజయశేఖర రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు విషయంలో హిందూజా తల్లిదండ్రులు, బంధువులు, విజయశేఖర రెడ్డి బంధువుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తడంతో తమకు అన్యాయం జరుగుతోందంటూ వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ కృష్ణమోహన్ ఆదివారం సాయంత్రం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని విచారణ చేశారు. హిందూజా తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని స్పష్టం చేశారు.

పిల్లలకు న్యాయం చేయండి

పలమనేరుకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందన్న కోపంతో అల్లుడే తమ కూతురిని హత్య చేసి ఉంటాడని హిందూజా తల్లిదండ్రులు జీవనజ్యోతి, లోకనాథరెడ్డి ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ కృష్ణమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో తమ కుమార్తె, అల్లుడి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయని, భర్త మారుతాడన్న నమ్మకంతో హిందూజా ఉండేదని, చివరకు అతని చేతిలోనే కడతేరిపోయిందని విచారం వ్యక్తం చేశారు. హిందూజా పిల్లలకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

సాగుకు విరామం..'పాడి'కి శ్రీకారం


చక్రాయపేట మండలంలోని పాడిపశువులు


బీళ్లుగా మారిన పంటపొలాలు

చక్రాయపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు తదితర కారణాలతో ఏటేటా నష్టాలబారిన పడుతున్న రైతు ప్రత్యామ్నాయ మార్గాలవైపు దృష్టి సారిస్తున్నాడు. సాగునీటి వనరులేవీ లేకపోవడంతో చక్రాయపేట మండలంలో కేవలం వర్షంపైనే ఆధారపడి వేరుశనగ, వరి, మామిడి పంటలు సాగు చేస్తారు. గతంలో వేరుశనగ, కంది,ఉలవ,సజ్జ, జొన్నలాంటి పంటలు దాదాపు 2000 హెక్టార్లలో సాగు చేసేవారు. ఏటేటా నష్టాల కారణంగా ప్రస్తుతం ఒక్కరు కూడా ఆయా పంటలు సాగు చేయడం లేదు. రెండు బర్రెలను పట్టుకున్న బతకవచ్చని నిర్ణయానికి వచ్చి పాడి వ్యాపారం మొదలుపెట్టారు. ప్రస్తుతం మండలంలో ప్రతిరోజు దాదాపు నాలుగు వేల నుంచి ఐదు వేల లీటర్ల పాలు విక్రయిస్తున్నట్లు సమాచారం. వీటికి అనుగుణంగా మండల కేంద్రంలో రెండు సంస్థలు పాల సేకరణ కేంద్రాలు పెట్టాయి వీటికి ప్రతి రోజూ 3,500 లీటర్ల దాకా పాలు వస్తున్నట్లు సమాచారం ప్రస్తుతం బర్రె పాలకు లీటర్‌కు రూ.83 నుంచి రూ.85 వరకూ చెల్లిస్తున్నారు. ఆవుపాలకు రూ.35 ఇస్తున్నట్లు తెలిసింది. రోజుకు ఒక బర్రె మూడు లీటర్లు ఇచ్చిన నెలకు 90 లీటర్ల పాల ఉత్పత్తి ఉంటుంది. దీంతో దాదాపు రూ.10వేల ఆదాయం లభిస్తోంది..

ఖర్చు ఎక్కువ.. ఆదాయం తక్కువ



రైతు పరిస్థితి నానాటికి కష్టతరం అవుతోంది. బతకడం భారమై పోతోంది. వర్షాలు లేవు, పంటలు రావు, పంటతో వచ్చిన ఆదాయం కన్నా ఆ పంటల కోసం చేసిన అప్పులు ఎక్కువ అవుతున్నాయి. దీనితో వ్యవసాయం చాలించి, మూడు బర్రెలను పెట్టుకొని డెయిరీకి పాలుపోసి జీవనం సాగిస్తున్నాం. నెలకు రూ.10వేల నుంచి రూ.15వేలు ఆదాయం వస్తోంది. మరో రెండు బర్రెలను కొనుక్కోవాలని అనుకుంటున్నాం.

- దయ్యం నాగేశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డిగారిపల్లె

మానసిక క్షోభకు గురిచేశారని ఫిర్యాదు

● వైసీపీ సర్పంచ్ కుటుంబంపై కేసు నమోదు

ముద్దనూరు జూన్29(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె గ్రామ సర్పంచ్ అరుణమ్మ, ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం తనపై అసభ్య పదజాలంతో కూడిన కరపత్రాలు పంచారని బీజేపీ నాయకుడు మోహన్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు .కొత్తపల్లెకు చెందిన మోహన్‌రెడ్డిపై అసభ్యకర పదాలు ముద్రించిన కరపత్రాలను గ్రామంలో విచ్చలవిడిగా వెదజల్లారు. వాటిలో మోహన్‌రెడ్డి తో పాటు అతని తల్లిని కూడా దూషించారు. మోహన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిపై కూడా దాడి చేశారు. దీంతో మోహన్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. మోహన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ అరుణమ్మ, భర్త రామిరెడ్డి, కుమారుడు లక్ష్మిరెడ్డి మరో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అటవీ ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు

సిద్దవటం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కడప ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కనుమలోపల్లె ఫారెస్ట్ బీట్‌లో ఆదివారం సిద్దవటం పోలీసులు తనిఖీలు చేశారు.. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం అరికట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు శివప్రసాద్, రాముడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అక్రమంగా వృక్షాల నరికివేత


రిజర్వాయర్ ప్రాంతంలో నరికివేసిన వృక్షాలు

వాల్మీకిపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతంలో చెట్లు అక్రమంగా నరికివేసి సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రిజర్వాయర్ కోసం ప్రభుత్వానికి భూములు అప్పగించి నష్టపరిహారం పొందిన కొందరు వ్యక్తులు, ఆ భూముల్లోని అల్లనేరేడు, కొబ్బరి ఫలసాయాన్ని విక్రయిం చుకుని సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. రిజర్వాయర్ ప్రాంతంలో ఈ అక్రమాలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'కళాంజలి'ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

రాజంపేట టౌన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కళాంజలి సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వైష్ణవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రముఖ సినీ గాయకులు ఎస్పీ బాలసుబ్రమణ్యం, ఘంటసాల జ్ఞాపకార్థం ప్రతి ఏడాది ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు ఆకాశవాణి, సంగీత విద్వాంసుడు గుణకల సుబ్బరాయుడు, నవోదయ సంగీత స్కూల్ విద్వాంసుడు వెంకటాద్రి, నిర్వాహకులు సత్యవతిదేవి, ఎస్.రాధిక, పలు ప్రాంతాల నుంచి వచ్చిన గాయని గాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి అమ్మవారి సీమంతం



పీలేరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వారాహి అమ్మవారి గుప్త నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పంచమి రోజున పీలేరులో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సీమంతం నిర్వహించారు. పట్టణంలోని శివాలయ ప్రధాన అర్చకులు విరూపాక్షం కుమార స్వామి ఇంట్లో జరిగిన అమ్మవారి సీమంతంలో పట్టణంలోని మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని పూజించుకున్నారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి వివిధ రకాల పుష్పాలు, వంటకాలు సమర్పించి అమ్మవారిని పూజించారు. మహిళలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా విరూపాక్షమ్మ జాతర



కలకడ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): బొజ్జాగుంటపల్లి గ్రామదేవత విరుపాక్షమ్మ జాతరను గ్రామస్థులు వైభవంగా చేసుకున్నారు. ఇందులో భాగంగా చాందినీ బండ్లను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువజాము వరకు కోలాటాలు, బళ్లారి బాణసంచా పేల్చూతూ అమ్మవారిని పూలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బీసీలే పార్టీకి బలం : ఎమ్మెల్యే



ఆత్మీయ సమావేశంలో ఐక్యత తెలుపుతున్న రాష్ట్రఅధ్యక్షుడు రాజశేఖర్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, జూన్29(ఆంధ్రజ్యోతి): బీసీలే టీడీపీకి బలమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణ కల్యాణమండపంలో నిర్వహించిన బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే విజయభారతీ ఇంగ్లీషుమీడియం హైస్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుని ఐక్యంగా ముందుకు వెళితే బీసీలు అన్ని విధాలా లబ్ధి పొందవచ్చన్నారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ మాట్లాడుతూ ఇంతవరకు అన్ని ప్రభుత్వాలు బీసీలను అణగదొక్కడంతో సమాజంలో అన్ని విధాలా వెనుకబడిపోయారన్నారు. కులగణన చేసి బీసీలకు అందవల్సిన రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఇప్పటికీ మహిళల అభివృద్ధి రాష్ట్రంలో చాలా వెనుకబడి ఉందన్నారు. బీసీలకు, మహిళలకు రాజ్యాంగం హక్కులు కల్పించినా సక్రమంగా అమలు కాలేదని ఆరోపించారు. మహిళలు చుదువుకున్నా అన్ని రంగాల్లో బీసీ మహిళలు ముందుకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బీసీలను ఉత్తేజ పరిచి ముందుకు నడిపిస్తామన్నారు. నీరుగుట్టవారిపల్లె జ్యోతిరావ్ పూలే విగ్రహం మొదలు శ్రీకృష్ణ కల్యాణమండపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నేత జంగాల శివరాం, కాంగ్రెస్ నేత రెడ్డి సాహెబ్, బీసీ నేతలు రామలింగ, గోవిందు, వెంకటరమణ, నాగరాజ, గురుమూర్తి, శ్రీరాములు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే అజెండానా..?

● వామపక్షాలకు టీడీపీ అధికార ప్రతినిధి హితవు

మదనపల్లె టౌన్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో అభివృద్ధిని అడ్డుకోవడమే వామపక్షాల అజెండాగా పనిచేస్తున్నాయని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో యోగా గురువు రాందేవ్‌బాబా వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సుముఖత వ్యక్తం చేశారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటైతే పర్యాటకులు సహా యోగ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వందలాది కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందన్నారు. మదనపల్లెలో వామపక్షాలు హార్సిలీహిల్స్‌లో వెల్‌నెస్ సెంటర్‌ను అడ్డుకుంటామని ప్రకటనలివ్వడం విచారకరమన్నారు. కేవలం ఉనికి కోసమే వారి ప్రచారాలు చేసుకుంటున్నారన్నారు. వందలాది మందికి జీవనోపాధి కల్పించే ఇలాంటి కొత్త ప్రాజెక్టును వామపక్షాలు అడ్డుకుంటామని చెప్పడం విడ్డూరంగా వుందన్నారు. ఇప్పటికైనా వామపక్షాలు సదుద్దేశంతో ఆలోచించి అభివృద్ధికి సహకరించాలని ఆయన హితవు పలికారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయండి : సీపీఐ

మదనపల్లె, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.కోట్లు నిధులు కేటాయించాలని, పెండింగ్, తెగిపోయిన ప్రాజెక్టును పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఆదివారం సీపీఐ జిల్లా రెండో మహాసభల ఆహ్వానకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పడమటి రైతాంగం పంటకు గిట్టుబాటు ధర లేక అప్పులపాలు అవుతుంటే, రైతును ఆదుకోవాల్సిందిపోయి బాబాకు భూమిని కేటాయిస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. హార్సిలీహిల్స్‌ను అమ్మేస్తే అడ్డుకుంటామని, అంగుళమైనా వదులుకోమన్నారు. యోగా ప్రచారం మ్యాట్లు కొనుగోళ్లకు రూ.300కోట్లు దుర్వినియోగం చేసిన చంద్రబాబు విజనరీ లీడర్ అవుతాడా? అంటూ ప్రశ్నించారు. ఆగిపోయిన మెడికల్ కళాశాల, మదనపల్లెకు హాస్పిటల్, ఆగిన కడప-బెంగళూరు రైల్వే మార్గాన్ని, చిప్పిలి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు మొరవ పనులు పునఃప్రారంభించాలని అప్పుడే చంద్రబాబుకు విజనరీ లీడర్‌గా గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాంతి సంఘీభావం నేత జి.వి.శివకుమార్, సీపీఐ నేతలు పి.ఎల్.నరసింహులు, పి.మహేష్, కృష్ణప్ప, మనోహర్‌రెడ్డి, సాంబశివ, సుమిత్రమ్మ, చిన్నయ్య, దేవర, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



సరిహద్దు ప్రాంతానికి భద్రత కరువు

పెద్దతిప్ప సముద్రం పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత ● పేట్రేగుతున్న అసాంఘిక కార్యకలాపాలు
కర్ణాటక సరిహద్దులో జోరుగా సాగుతున్న పేకాట, కోడిపందాలు ● పట్టపగలే చోరీలు

పెద్దతిప్పసముద్రం జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత నెలకొంది. ఎన్నికలు తర్వాత మండలంలో పోలీసు కొరత వెంటాడుతోంది. ఇదే ఆసరాగా తీసుకుని అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. పథకం ప్రకారం వారి ఆటలు సాగిస్తున్నారు. అటు కర్ణాటక, ఇటు అనంతపురం జిల్లా సరిహద్దు గ్రామం పెద్దతిప్పసముద్రం. ఈ ప్రాంతంలో కర్ణాటక, బయటి జిల్లా సరిహద్దు గ్రామాల నుంచి వచ్చి విచ్చల విడిగా కోడిపందాలు, పేకాడుతున్నా అరికట్టేందుకు సిబ్బంది అనేక రకాల ఇక్కట్లకు గురవుతున్నారు. 29 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ఇక్కడ కేవలం 10 మంది మాత్రమే ఉన్నారు. ఉన్న సిబ్బందిలో ఇద్దరు కోర్టు డ్యూటీలకు వెళుతుంటారు. ఒకరిద్దరు మినహా బందోబస్తులకు తరలి పోతుండడంతో పట్టపగలే ఇళ్లల్లో చోరీలు జరుగుతున్నాయి. సరిహద్దు గ్రామాల్లో కోడిపందేలు, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు పోలీసులు వెళ్లేందుకు కూడా సిబ్బంది ఉండరు. ఉన్న ఒక్కరు వెళ్లినా సరిహద్దు ప్రాంతం అంటూ బుకాయించి పంపుతున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. వివరాల్లోకెళితే....

పెద్దతిప్పసముద్రం మండలానికి ఓ వైపు అనంతపురం జిల్లా సరిహద్దు, మరో వైపు కర్ణాటక రాష్ట్రం సరిహద్దుగా ఉండడంతో స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో కష్టతరంగా మారింది. సరిహద్దు గ్రామాల్లో విచ్చల విడిగా కోడిపందాలు, పేకాట జోరుగా సాగుతున్నాయి. పోలీస్ స్టేషన్‌కు 29 మంది సిబ్బంది కావాల్సి ఉండగా ఇక్కడ కేవలం 10 మందే ఉన్నారు. మండల పరిధిలోని బూచిపల్లె, మారుగానిపల్లె, కందుకూరు, పులికల్లు గ్రామాల్లో ఇళ్లల్లో తరచూ చోరీలు జరుగుతున్నాయి.



కర్ణాటక సరిహద్దు గ్రామాలైన పట్టెంవాండ్లపల్లె, కుక్కలపల్లె, బూచిపల్లె గ్రామాల్లో పట్టపగలే కోడిపందాలు, పేకాట జోరుగా సాగుతున్నాయి. పోలీసులు దాడులు చేసినా కేసులు మాత్రం నమోదు చేయడం లేదనే విమర్శలు బలంగా విన్పిస్తున్నాయి. ఇటీవల బదిలీల్లో భాగంగా కొందరు పోలీసులు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో సిబ్బందిని నియమించడం లేదు. ఉన్న 10 మంది సిబ్బందిలో ఇద్దరు కోర్టు డ్యూటీ లకు వెళతారు. ఇక మూడు నెలల కిందట మదనపల్లె తాలుకా స్టేషన్ నుంచి వచ్చిన ఎస్ఐ స్టేషన్‌కు ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో ఎవరికీ తెలియదు. స్టేషన్‌లో ఒక ఏఎస్ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు విధుల్లో ఉంటారు. వీరు అతి కష్టం మీద విధులు చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళల మిస్సింగ్ కేసులు బాగా పెరిగాయి. కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నట్లు సమాచారం. సిబ్బంది కొరతతో రాత్రిళ్లు పోలీసుల గస్తీ లేక రాత్రిళ్లు గ్రామాల్లో ఆకతాయిల ఆగడాలు జోరుగా సాగుతున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా సిబ్బంది కొరత కారణంగా ప్రమాద స్థలికి సమయానికి చేరుకోలేక పోతున్నారు. చాలా కేసులు పెండింగ్‌లో ఉండడంతో బాధితులు పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సి వస్తోందని, పెండింగ్ వివరాలను ఉన్నతాధికారులకు తప్పుడు నివేదిక అందిస్తున్నారనే విమర్శలున్నాయి. రోడ్డు ప్రమాదాలు జరిగినా కేసు నమోదు చేసిన విషయం కనీసం విలేకరులకు సమాచారం అందించలేని పరిస్థితిలో స్టేషన్ అధికారి ఉన్నారు. ఇప్పటికైనా పోలీస్ స్టేషన్‌లో తగిన సిబ్బందిని నియమించి శాంతిభద్రతలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వారాహి పుష్ప పల్లకీ సేవ

ఆకట్టుకున్న వారాహి పారాయణం ● చిద్విలాసమూర్తియై భక్తులకు దర్శనం ● సతీసమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే





ప్రత్యేక అలంకరణలో వారాహి అమ్మవారు - పల్లకీ సేవలో పాల్గొన్న కిశోర్‌కుమార్ రెడ్డి దంపతులు

కలికిరి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాంతులీనే విద్యుద్దీపాల నడుమ వారాహి మాత పుష్ప పల్లకీ సేవ ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. స్థానిక యల్లమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి సతీమణి తనూజా రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తిశ్రద్ధలతో మహిళలు వారాహి పారాయణం నిర్వహించారు. అనంతరం వారాహి మాత ఉత్సవ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలు, వెండి బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. తమిళనాడు రాష్ట్రం ఆంబూరు నుంచి ప్రత్యేక నిపుణులు పర్యవేక్షణలో అత్యంత ఆకర్షణీయంగా వారాహి అమ్మవారి పుష్ప పల్లకీని అలంకరించారు. ఇందుకోసం వివిధ రకాల విదేశీ పుష్పాలతో సిద్ధం చేసిన ప్రత్యేక పుష్ప పల్లకీలో అమ్మవారిని ఆశీనురాలిని చేసి పూజా కార్యక్రమాలు పూర్తి చేశారు. అనంతరం నిర్వహించిన గ్రామోత్సవంలో అమ్మవారు చిద్విలాసమూర్తియై భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. మంగళ వాయిద్యాలు, మేళతాళాల, బాణసంచా సంబరాల మధ్య అమ్మవారు పుష్ప పల్లకిలో విహరించారు. అమ్మవారి ఊరేగింపు సాగుతున్నంత సేపూ అమ్మవారి మూలమంత్రం, పలికారు. అంతేకాకుండా 'నమోస్తుతే మహారౌద్రే! నిశాచారిణి నామినీ! వారాహి శత్రు సంహారే! రక్ష రక్ష నమోస్తుతే' అంటూ స్తోత్రం పఠించారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి, ఆయన సతీమణి తనూజ రెడ్డి పల్లకీని లాగుతూ అమ్మవారి పట్టణ విహారాన్ని స్వాగతించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చంద్రకుమార్ రెడ్డి, మాజీ సర్పంచు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, యల్లమ్మ ఆలయ నిర్వాహకులు అశోక్ రెడ్డి, యోగేష్ రెడ్డి, మధుసూదన రెడ్డి, సురేంద్ర రెడ్డి, పార్లమెంటు ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి పుష్ప పల్లకి మూడు కిలోమీటర్ల దూరంలోని ఎమ్మెల్యే స్వగ్రామం నగరిపల్లె వరకూ గ్రామోత్సవం సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ప్రతిభావంతులకు చేయూత

పీలేరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తమ సంస్థ ద్వారా ప్రతిభ కలిగిన పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం చేయూత నిస్తామని మానవత సంస్థ అధ్యక్షుడు శెట్టిసుబ్రహ్మణ్యం, చైర్మన్ రామచంద్ర పేర్కొన్నారు. ఆదివారం జరిగిన ఆ సంస్థ నెలవారీ సమావేశంలో మాట్లాడుతూ పేద విద్యార్థుల చేయూతలో భాగంగా ఈ ఏడాది ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉత్తమ మార్కులు సాధించిన టెన్త్ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. సభ్యులు కృష్ణమూర్తి, జీవీ రమణ, పోతంశెట్టి రమేశ్, అశోక్, హరి, కుమార్, అక్రమ్ బాషా, రెడ్డప్ప, సిద్దప్ప, తదితరులు పాల్గొన్నారు.

జనరేటర్‌ను వినియోగించండి



వృథాగా పడి ఉన్న జనరేటర్

వాల్మీకిపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ పురాతన భవనాల వద్ద ఉన్న విద్యుత్ జనరేటర్‌ను వినియోగించమని ప్రజలు కోరుతున్నారు. కొత్త భవనాలు నిర్మాణం జరిగాక పాత భవనం వద్ద ఉన్న జనరేటర్ నిరుపయోగంగా పడి ఉంది. ఉపయోగంలో ఉన్నప్పటికీ కార్యాలయ నూతన భవనాలకు మార్పిడి చేయకపోగా గాలికి వదిలేశారు. దీంతో ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తూ జనరేటర్ తుప్పు పట్టి పోతోంది. అధికారులు స్పందించి వృథాగా పడి ఉన్న జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకువస్తే నూతన భవనాలకు విద్యుత్ అంతరాయ సమస్యలు రాకుండా ఉంటుంది.

మొహరం వేడుకలకు అంకురార్పణ

రామసముద్రం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలో మొహరం వేడుకలకు అంకురార్పణ జరిగింది. ఎగువపేట, దిగువపేట, తిరుమలరెడ్డిపల్లె, ఆర్.నడింపల్లెల్లో పీర్ల చావడి వద్ద ఉన్న అగ్ని గుండానికి ప్రత్యేక ప్రార్థనలు చేసి గంధం, పూలు చల్లి వేడుకలకు అంకురార్పణ చేశారు. కులమతాలకు అతీతంగా ఈ వేడుకలు నిర్వహిస్తారు. తొమ్మిదో రోజు తిరుమలరెడ్డిపల్లె, ఆర్.నడింపల్లె, దిగువ పేట, ఎగువపేట నుంచి ప్రత్యేక ప్రభలతో కూడిన పీర్లను ఊరేగిస్తారు. వేడుకలకు ఇతర జిల్లాల భక్తులు పాల్గొంటారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పీలేరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): 'మేము సైతం' ఫౌండేషన్, ఏజే వైద్యశాల ఆదివారం పీలేరులో సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 129 మందికి ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి వివిధ జబ్బులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ షాహిన్‌షా, వైద్యులు అలీమ్, జెన్నీఫర్ మాట్లాడుతూ ప్రాథమిక వైద్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ప్రతి ఆరు నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బుజ్జు, కలకడ బాబు, షాజహాన్, రిజ్వాన్, ఆదిల్, జావిద్, సుహేల్, షమా, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి



వాల్మీకిపురంలో సమావేశమైన పెన్షనర్లు

వాల్మీకిపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఐక్యంగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని వాల్మీకిపురం మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బీవీ రమణ పేర్కొన్నారు. ఆదివారం పెన్షనర్స్ కార్యాలయంలో సమావేశమై ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు తదితర వాటిపై చర్చించారు. యోగా ఆధ్యాత్మికత, ఆరోగ్యంపై తెలియజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు వలిగిరి శంకర్, ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి, తదితర సభ్యులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు



కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీరామ్ చినబాబు

రామసముద్రం, జూన్ 29 (ఆంధ్ర జ్యోతి): టీడీపీ ప్రభుత్వంలో పార్టీకి పని చేసిన వారికే పదవులు దక్కుతాయని రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు స్పష్టం చేశారు. ఆదివారం మండలానికి విచ్చేసిన ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అక్రమ కేసుల్లో చిక్కుకున్న వారికి, సర్పంచులుగా పోటీ చేసి ఓడిపోయిన వారికి, పార్టీ కోసం అహర్నిశ లు శ్రమించిన వారికి పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. నిజమైన టీడీపీ నేతలు, కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని కొందరు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్పందించిన చినబాబు కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వారికి అన్యాయం జరగదని, అలాంటి పరిస్థితి వస్తే తాను అండగా ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

వాల్మీకిపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని వాల్మీకిపురం ఎంపీడీఓ మనోహర్‌రాజు అన్నారు. ఆదివారం ఉదయం ఆయన పట్టణంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. నివాసాల చెంత డ్రైనేజీలు, చెత్త కుండీల స్థితిగతులను ఆరా తీస్తూ రోజూ ఉదయం వీధుల వెంబడి చెత్త సేకరణ వాహనాలు వస్తున్నాయా లేదా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. నివాసాల చెంత కాల్వల్లో చెత్త పారవేయడం, ప్లాస్టిక్ కవర్లు వేయడం ద్వారా డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, పంచాయతీ ఈఓ రవీంద్రనాథ్, పారిశుధ్య కార్మికులు సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఎం ఫౌజియా బేగంకు సన్మానం



ఫౌజియా బేగంను సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు

పీలేరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రేపు ఉద్యోగ విరమణ చేయనున్న పీలేరు అయ్యప్పరెడ్డి కాలనీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం ఫౌజియా బేగంను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఆదివారం సన్మానించారు. మదనపల్లె డివిజన్ ఉప విద్యాశాఖాధికారి లోకేశ్వర్ రెడ్డి మాట్లాడారు. హెచ్ఎంలు గంగాధరం, వేణుగోపాల్ రెడ్డి, సురేంద్ర, రెడ్డప్ప, శోభ, నాగరత్నమ్మ, పార్వతమ్మ, నటరాజ, సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

తంబళ్లపల్లె, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లితండ్రులపై, వాహన యజమానులపై చర్యలు తప్పవని ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం తంబళ్లపల్లె-మదనపల్లె రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల రికార్డులు తనిఖీ చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలు వివరించారు. రికార్డులు లేని, రూల్స్ పాటించని వాహనదారులకు జరిమానాలు విధించారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారాయుడు

మదనపల్లె అర్బన్, జూన్29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని, పనికి సమానం వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమావిళ్ల సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏఐ టీయూసీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీలో పని చేస్తున్న డైలీ వేజ్ కార్మికులకు రావాల్సిన ఆరు నెలల జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. వారికి ఆప్కాస్‌లో అవకాశం కల్పించి ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. 25 రోజులుగా సమ్మె చేస్తున్న వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. జూలై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ వర్కర్స్ పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, మున్సిపల్ వర్కర్స్ నేతలు పాల్గొన్నారు.

బాస్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం

మదనపల్లె, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నారాయణ హృదయాలయ వైద్యులతో కలిసి భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) నిర్వహించిన 20వ ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమ్మ చెరువు మిట్ట మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 176 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో తదితర పరీక్షలు జరిపి 11 మందికి గుండె జబ్బు ఉన్నట్లు నిర్ధారించి శస్త్ర చికిత్సకు రెఫర్ చేశారు. వీరికి కోలార్ నారాయణ హార్ట్ సెంటర్‌లో ఉచితంగా చికిత్స చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్, నారాయణ హృదయాలయ కోలార్ వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్ కుమార్, టెక్నీషన్లు, రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపకు డు కోనేటి దివాకర్, బాస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, రాష్ట్ర కోశాధికారి నీరుగట్టి రమణ, కార్యదర్శి పీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సందడే... సందడి

ములకలచెరువు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): బురకాయలకోట జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1986-87లో టెన్త్ చదివిన విద్యార్థులు 38 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తాము చదువుకున్న తరగతి గదిలో కూర్చుని, అప్పటి అల్లరి పనులు, ప్రస్తుతం స్థిరపడ్డ రంగాల గురించి చర్చించారు. అనంతరం టీచర్లు చంద్రశేఖర్, రామకృష్ణమరాజును సన్మానించారు. గుత్తికొండ త్యాగరాజు, సీవీ రమణా రెడ్డి, పీవీ రమణ, మంగరాజు, బాబు, శ్రీనివాసులు, నరసింహులు, వెంకట్‌రెడ్డి, లక్ష్మన్న, సంధ్యారాణి, రెడ్డెమ్మ, లక్ష్మీదేవి, ప్రమీల పాల్గొన్నారు.

